జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్గొండ
సూర్యపేట - యాదాద్రి భువనగిరి
సోమవారం 12 అక్టోబర్ 2026 పేజీలు:12





## దశాబ్ది ఉత్సవాల్లో సీనియర్ జర్నలిస్టుకు సన్మానం

**ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 11(ప్రజా జ్యోతి):**
తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ ఎలిమినేటి నగేష్‌ను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

వివరాలు 2లో

## 2028 జూన్ నాటికి శ్రీశైలం సొరంగం పూర్తి చేయడమే నా లక్ష్యం..

- నల్లగొండ జిల్లాలో ప్రతి గ్రామానికీ డబుల్ రోడ్డు.. రూ.74 కోట్లతో పనులకు శంకుస్థాపన..
- గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం...
- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.





**నల్లగొండ అక్టోబర్ 11,(ప్రజా జ్యోతి):**
2028 జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే తన జీవిత లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లాలోని ప్రతి గ్రామానికీ డబుల్ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఆదివారం జిల్లాలో రూ.74 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.కనగల్ మండలం తెలకంటిగూడెం నుంచి తొరగల్లు, జంగమాయిగూడెం మీదుగా ముషంపల్లి వరకు రూ.41 కోట్లతో, శేరిలింగోటం వద్ద నుంచి చెట్లచెన్నారం, చిన్నమాదారం, తంగెళ్లవారిగూడెం మీదుగా ముషంపల్లి వరకు రూ.33 కోట్లతో చేపట్టనున్న రహదారుల విస్తరణ, పటిష్ఠీకరణ పనులకు శ్రీకారం చుట్టారు.

వివరాలు 2లో

## అశ్వరావుపల్లి ప్రాజెక్టు కాల్వలో నీటి ప్రవాహం పెంచాలి

- టంగుటూరు, గోలనుకొండ గ్రామాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన
- ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ఆలేరు అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**
అశ్వరావుపల్లి ప్రాజెక్టు నుంచి ఆలేరు మీదుగా టంగుటూరు, గోలనుకొండ గ్రామాలకు వెళ్లే కాల్వను గోలనుకొండ వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించారు. ఈ సందర్భంగా నీటి ప్రవాహాన్ని పెంచాలని సంబంధిత అధికారులను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ, కాల్వ ద్వారా ఆయా గ్రామాలకు తగినంత నీరు అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వివరాలు 2లో



## సమాచార హక్కు అమలులో నల్లగొండకు రాష్ట్రస్థాయి గుర్తింపు..

- రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం..
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌ను సత్కరించిన మంత్రి కోమటిరెడ్డి.

**నల్గొండ అక్టోబర్ 11,(ప్రజా జ్యోతి):**
పారదర్శకత, జవాబుదారీతనానికి నిదర్శనమైన సమాచార హక్కు చట్టం అమలులో నల్లగొండ జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది.

వివరాలు 2లో

# ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీకలు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు..!

## -ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ - యాద్గార్ పల్లి దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు

**మిర్యాలగూడ, అక్టోబర్ 11,(ప్రజాజ్యోతి):**





ఆధ్యాత్మిక భక్తికి, ఐక్యతకు దసరా మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రతీకలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్)అన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలంలోని యాద్గారిపల్లి దుర్గామాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, మిర్యాలగూడ నియోజకవర్గ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తొమ్మిది రోజులు పాటు తొమ్మిది రూపాలలో అమ్మవారిని ప్రత్యేక పూజలతో కొలవటం, గ్రామాల్లో తొమ్మిది రోజులపాటు ఆధ్యాత్మిక శోభతో పాటు ఐకమత్యం విరాజిల్లుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, తలకొప్పుల సైదులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు,ఇతర ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అశ్వరావుపల్లి ప్రాజెక్టు కాల్వలో నీటి ప్రవాహం పెంచాలి

మొదటిపేజీ తరువాయి



రైతులకు సాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా కాల్వలో నీటి ప్రవాహాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. టంగుటూరు, గోలనుకొండ గ్రామాల రైతులకు సాగునీరు అందేలా నీటి విడుదలను పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అశోక్, మాజీ అధ్యక్షుడు ఎజాస్, గ్రామ సర్పంచ్ ఇందూరి యాదిరెడ్డి, అడ్వకేటు హరిబాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు భీమగాని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ప్రశాంత్, వెంకటేశు, మధు, తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు అమలులో నల్లగొండకు రాష్ట్రస్థాయి గుర్తింపు..

మొదటిపేజీ తరువాయి



సమాచార హక్కు చట్టం 4(1)(బి) కింద స్వచ్ఛందంగా సమాచారాన్ని వెల్లడించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఇటీవల రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం నల్లగొండలోని ఇందిరా భవన్ వద్ద కలెక్టర్ చంద్రశేఖర్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు, పారదర్శకతను పెంపొందించి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు కలెక్టర్‌ను మంత్రి అభినందించారు.

# దశాబ్ది ఉత్సవాల్లో సీనియర్ జర్నలిస్టుకు సన్మానం

మొదటిపేజీ తరువాయి

ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమం, కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక కథనాలు అందించినందుకు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఆత్మకూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# 2028 జూన్ నాటికి శ్రీశైలం సొరంగం పూర్తి చేయడమే నా లక్ష్యం..

మొదటిపేజీ తరువాయి

జిల్లాలో రూ.1,600 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని, రూ.900 కోట్లతో నల్లగొండ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. మెరుగైన రవాణా సౌకర్యాలతో పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తెలకంటిగూడెంలో ఇప్పటికే 107 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మిగిలిన అర్హులకూ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలు, రైతులకు సూచించారు. శ్రీశైలం సొరంగ మార్గం పూర్తయితే రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఆర్ అండ్ బీ ఎస్ఈ మోహన్, ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, ఈఈ శ్రీధర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అప్పం సోమరాజంకు ఘన నివాళులు

**రామన్నపేట, అక్టోబ ర్ 11 (ప్రజా జ్యోతి)**



రామన్నపేట సీనియర్ జర్నలిస్టు వార్తా విలేకరి,మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అప్పం చెన్నకేశ్వర్ తండ్రి సోమరాజం శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం రామన్నపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రామన్నపేట లోని వారి స్వగృహంలో సోమరాజం మృత దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులు కనుతాల శశిధర్ రెడ్డి(సాక్షి), గంగుల నరేందర్ రెడ్డి(ఆంధ్రజ్యోతి), గౌరవ అధ్యక్షులు ఎండి తఖియెద్దిన్(నమస్తే తెలంగాణ), క్లబ్ అధ్యక్షులు కుకుడాల మహేందర్ రెడ్డి (ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శి లవణం ఉపేందర్(ప్రజా జ్యోతి), ఉపాధ్యక్షులు బోయపల్లి యాదయ్య (విజన్ ఆంధ్ర), మద్దెగల్ల నరసింహ (జనం సాక్షి), కోశాధికారి జినుకల శ్రీనివాస్(తెలంగాణ కేసరి), సహాయ కార్యదర్శి ఎండి అర్షద్ బెగ్(మన తెలంగాణ),ఆర్గనైజర్ మాంద్ర సత్యనారాయణ (ప్రజాతంత్ర), ప్రచార కార్యదర్శి బొడ్డు పరశురాములు(తొవ్వ), కార్యవర్గ సభ్యులు నడిగోటి కృష్ణ(ప్రజాసాక్షి) కైరంకొండ సంతోష్ (మన ప్రగతి)పాల్గొన్నారు.

# గొర్రెల కాపరికి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి లక్ష ఆర్థిక సాయం!

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):**



బీబీనగర్ రైలు ప్రమాదంలో సుమారు 350కు పైగా గొర్రెలను కోల్పోయి తీవ్ర నష్టానికి గురైన భూదాన్ పోచంపల్లి మండలం జూలూరు గ్రామ పరిధిలోని అలీనగర్ చెందిన బాలముని కిష్టయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, సిలువేరు బాలనర్సింహ, జూలూర్ మాజీ సర్పంచ్ యకరి రేణుక నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాగృతిలో డిగ్రీ అండ్ పీజీ కళాశాల లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**భువనగిరి,అక్టోబర్ 11(ప్రజాజ్యోతి)**






భువనగిరి పట్టణం లోని స్థానిక జాగృతి,డిగ్రీ మరియు పీజీ కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి పట్టణ సిఐ డి.వెంకటేశ్వర్లు,కళాశాల చైర్మన్ కె,బాలక్రిష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు బతుకమ్మ పండుగ విశిష్టతను తెలుసుకొని భవిష్యత్ తరాలకు తెలియజేసేలా మార్గదర్శకంగా ఉండాలని,భారతదేశ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ జీవితంలో క్రమశిక్షణతో మెలుగుతూ తల్లిదండ్రులకు,విద్యా సంస్థకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలియజేయడం జరిగింది.విద్యార్థులు సాంప్రదాయ వేషధారణ లో హాజరై ప్రతి క్లాస్ నుండి పెద్ద ఎత్తున వివిధ రూపాలలో వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేయడం జరిగింది. ప్రత్యేక ఆకర్షణతో కూడిన బతుకమ్మలను తయారుచేసిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ సింగణబోయిన మల్లేశం బహుమతులను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సుధా కిషోరీ,శ్రావణి,భవిత,సోనీ శివరంజని,సాత్విక చరిష్మా ,శిరీష తదితర అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

## - ఏఐకే మిస్ జిల్లా కోశాధికారి కొత్తపేట చంద్రయ్య.

**ఆలేరు అక్టోబర్ 11(ప్రజా జ్యోతి)**




యాదాద్రి భువనగిరి జిల్లా,మూటకొండూరు మండల స్థాయి అఖిల భారత రైతు కూలీ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఎ ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి కొత్తపేట చంద్రయ్య మాట్లాడుతూ దేశంలోని రైతు కూలీలు పండించిన పంటకు గిట్టుబాటు రాక,నకిలీ విత్తనాల సమస్యలతో నిత్యం సతమతమవుతున్నారు ఈ సమస్యలన్నిటిని పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు పంగ రవి, పిఓడబ్ల్యు జిల్లా నాయకులు జి అంజమ్మలు మాట్లాడగా ఏఐకేఎంఎస్ మూటకొండూరు మండల నూతన కార్యవర్గాన్ని ఐదుగురితోఎన్నుకున్నారు.అధ్యక్షులుగా జి స్వామి, కార్యదర్శిగా వి యాదగిరి,కార్యవర్గ సభ్యులుగా పి సత్తిరెడ్డి,బి ఎల్లయ్య,ఎస్ బిక్షపతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో పి సుధీర్,ఆర్ బాల నరసయ్య,ఆర్ బాలమ్మ,కె విజయ,కే మహేష్,కే శ్రీనిధి,ఆర్ మల్లేశం,ఆర్ రాములమ్మ,ఎస్ సత్తయ్య,ఎం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# సాగునీరు ఏదీ.. పంటలు ఎలా బతకాలి?

## - పగటిపూట నాణ్యమైన కరెంటు ఇవ్వాలి..
## - 14బీ కాలువకు మరమ్మతులు చేపట్టాలి
## - ప్రభుత్వానికి పాలారం రైతు తేజావత్ వీరన్న విజ్ఞప్తి

**పాలారం, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**

సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే రైతులు ఎలా బతకాలని పాలారం గ్రామానికి చెందిన రైతు తేజావత్ వీరన్న ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్, సాగునీటి సమస్యలు ఎదురవుతుండటంతో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.రాత్రిపూట విద్యుత్ సరఫరా వల్ల పొలాలకు నీరు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వీరన్న పేర్కొన్నారు. రైతుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పగటిపూట నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ సమస్యలతో సాగు పనులకు ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మరోవైపు పంట పొలాలకు సాగునీరు అందించే 14బీ కాలువకు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు చొరవ చూపాలని ఆయన కోరారు. కాలువలో నీరు సక్రమంగా ప్రవహించేలా అవసరమైన పనులు చేపట్టి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చూడాలని సూచించారు. కాలువ సమస్య పరిష్కారమైతే సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.పంటలు చేతికి వచ్చే కీలక సమయంలో విద్యుత్, సాగునీటి సమస్యలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని, సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని తేజావత్ వీరన్న కోరారు. పంటలు పూర్తిగా దెబ్బతినకముందే ప్రభుత్వం స్పందించి పగటిపూట నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు 14బీ కాలువకు మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఇథనాల్ పెట్రోల్ విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి...!

## - వ్యవసాయ రంగంపై ప్రభావాలను సమీక్షించాలి
## - రైతుల ఆదాయం, ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
## - సెమినార్లో ప్రొఫెసర్ నాగేశ్వర్

**మిర్యాలగూడ, అక్టోబర్ 11,(ప్రజాజ్యోతి):**

పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపి వినియోగించే విధానంపై కేంద్ర ప్రభుత్వానికి ముందు చూపులేకనే,ఆహార భద్రత విధానంలో ప్రతిష్టంబన ఏర్పడిందని దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక అనుధితి ఫంక్షన్ హాల్ లో రైతు సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన 'భారతదేశం లో ఆహార భద్రతపై ఇథనాల్ విధాన ప్రభావం' అనే అంశంపై జరిగిన సెమినార్లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇథనాల్ వినియోగం ద్వారా ముడిచమురు దిగుమతులను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం వంటి లక్ష్యాలు ఉన్నప్పటికీ, ఈ విధానం వల్ల రైతులకు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌కు, ఆహార భద్రతకు కలిగే ప్రభావాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తే ఇథనాల్‌కు పెరుగుతున్న డిమాండ్ ఈ పంటలను సాగు చేసే రైతులకు అదనపు మార్కెట్ అవకాశాలను కల్పించ వచ్చాన్నారు . అయితే, ఇథనాల్ ఉత్పత్తి కోసం వ్యవసాయ పంటల వినియోగంపెరిగినప్పుడు ఆహార అవసరాలు, పశుగ్రాస లభ్యత, పంటల ధరలు, సాగునీటి వినియోగంపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాని వివరించారు.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు సాగు ఖర్చులు తగ్గడం, మార్కెట్‌లో స్థిరమైన డిమాండ్ ఉండటం అత్యంత ముఖ్యమని . ఇథనాల్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు ఎంతవరకు చేరుతున్నాయి, ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు కలిగే లాభనష్టాలు ఏమిటి, పంటల సాగు





విస్తీర్ణంలో మార్పులు చోటుచేసుకుంటే ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం పడుతుంది అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసర మన్నారు.దేశంలో వ్యవసాయం కోట్లాది కుటుంబాలకు జీవనాధారమని . వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసే ఏ విధానమైనా రైతుల ఆదాయం, ఆహార భద్రత, పర్యావరణ సమతుల్యతను దృష్టిలో ఉంచుకొని అమలు చేయా లన్నారు.ప్రభుత్వం ఇథనాల్ విధానంపై స్వతంత్ర నిపుణుల కమిటీతో సమగ్ర అధ్యయనం చేయించి, రైతు సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.రైతులకు ప్రయోజనం చేకూర్చేలా, ఆహార భద్రతకు భంగం కలగకుండా, పర్యావరణానికి మేలు చేసే విధంగావిధానంలో అవసరమైన మార్పులు చేపట్టాలని తెలిపారు రైతుల సంక్షేమం, దేశ ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని . ఇంధన అవసరాలను తీర్చే ప్రయత్నంలో వ్యవసాయ రంగ ప్రయోజనాలు విస్మరించబడకుండా ఇథనాల్ పెట్రోల్ విధానాన్ని సమీక్షించా లన్నారు.పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం అనేది కేవలం ఇంధనానికిసంబంధించిన అంశం మాత్రమే కాదని ఇది వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, ఆహార భద్రత, భూగర్భ జలాలు, పర్యావరణం, దేశ ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్న విధాన మని తెలిపారు.రైతు సంఘం జాతీయ నాయకుడు జూలకంటి రంగారెడ్డి,రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేనిసుదర్శన్ లు మాట్లాడుతూ ఇంధన అవసరాల కోసం వ్యవసాయాన్ని ఉపయోగించుకోవచ్చు. కానీ వ్యవసాయాన్ని కేవలం ఇంధన ముడిపదార్థాల సరఫరా రంగంగా మార్చకుండా, రైతుల జీవనోపాధిని మరియు దేశ ఆహార భద్రతను కాపాడటం ప్రభుత్వ విధానంలో ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. నవంబర్ 15 నుండి 18వ తేదీ వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే జాతీయ రైతు సంఘం మహాసభ జరగనున్నదని, దేశవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు ఆ మహాసభలకు హాజరు కారున్నారని మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు.ఈసమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్,ఆదర్శరైతు జోన్నలగడ్డ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చెప్పుల దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

**-సకాలంలో స్పందించి కుటుంబాన్ని కాపాడిన ఫైర్ సిబ్బంది, స్థానికులు**
**- భారీగా ఆస్తి నష్టం, తప్పిన ప్రాణ నష్టం**
**-సహాయక చర్యల్లో ఎమ్మెల్యే బిఎల్ఆర్ చొరవ**

**మిర్యాలగూడ, అక్టోబర్ 11,(ప్రజాజ్యోతి ):**



మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపురం లో ఉన్న మెట్రో ట్రేడర్స్ హోల్ సేల్ చెప్పుల దుకాణంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ తో అకస్మాత్తుగా మంటలు చెలరేగి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా దట్టమైన పొగలు అలుముకోవడంతో, భవనంలోని సెకండ్ ఫ్లోర్ లో ఓ కుటుంబం చిక్కుకుపోయింది. స్థానికులు సమాచారం అందించడంతో సకాలంలో స్పందించిన ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని రక్షణ చర్యలు చేపట్టారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ ) సహాయక చర్యల్లో తనదైన చొరవ చూపించారు. ఫైర్ సిబ్బంది, స్థానికులను అప్రమత్తం చేసి సెకండ్ ఫ్లోర్ లో చిక్కుకున్న కుటుంబాన్ని సురక్షితంగా రక్షించగలిగారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మంటలను అదుపు చేసేందుకు ఎమ్మెల్యే బిఎల్ఆర్ మున్సిపాలిటీ నుండి అదనంగా వాటర్ ట్యాంకులను రప్పించి రక్షణ చర్యల్లో చొరవ చూపారు. దీంతో సకాలంలో మంటలను అదుపు చేయగలగటంతో పెను ప్రమాదం తప్పినట్టు అయింది. ఈ అగ్ని ప్రమాదంలో భారీ ఎత్తున వివిధ కంపెనీలకు చెందిన చెప్పులు దగ్ధం కావడంతో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించినట్లు షాపు యాజమాన్యం పేర్కొన్నారు.

## క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

**మునగాల అక్టోబర్11 (ప్రజా జ్యోతి):**

మునగాల మండల పరిధిలోని నరసింహులగూడెం గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం నరసింహులగూడెం ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) సీజన్-3 క్రికెట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గ్రామ సర్పంచ్ ఇందిరా నరసయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడలు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ స్నేహ భావంతో పోటీల్లో పాల్గొనాలని కోరారు. గ్రామంలో క్రీడాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూలకంటి కొండారెడ్డి, మార వెంకట్ రెడ్డి, గణేష్, క్రికెట్ సీనియర్ క్రీడాకారుడు రామారావు, క్రీడాకారులు శివ, సురేష్, వీరబాబు, వెంకటేష్, ఎస్కే జానీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలి సిపిఎం ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన

**ఆత్మకూర్ (ఎం) అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**



కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూరులోని శివాజీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఢిల్లీలో ధర్నాకు వెళ్తున్న సిపిఎం నాయకుల అరెస్టులను ఖండించారు. ఎస్ఐఆర్ విధానంతో సామాన్యులు దళితులు, మైనారిటీల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రచ్చ గోవర్ధన్, తుమ్మల సత్యనారాయణరెడ్డి, కందడి వెంకటరెడ్డి, వీరస్వామి, యాదయ్య, బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఘనంగా సన్మానం

**ఆత్మకూర్ ( ఎం) అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**



తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన ఉద్యమకారులను జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా ఏర్పాటుకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యమకారులకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, ఆత్మకూరు (ఎం) మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ పాల్గొన్నారు. సన్మాన ఉద్యమకారులు పరకాల నరసయ్య గౌడ్, ఎలిమినేటి నాగేష్, గంధమల్ల శివశంకర్ సోమయ్య,మామిడి శ్రీనివాస్ రెడ్డి, ఎలగందుల విజయ్‌లను సన్మానించారు.

# బతుకమ్మ వేడుకల్లో కుల వివక్ష.. ఎస్సీ మహిళలకు అవమానం!

## - బతుకమ్మ ఆడకుండా అడ్డుకున్నారని ఆరోపణ..

## ఆత్మకూర్ ఎం పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు

**ఆత్మకూర్ (ఎం) అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**




యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ ఎం మండలం టి.రేపాక గ్రామంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల సందర్భంగా కుల వివక్ష చోటుచేసుకుందని ఎస్సీ మహిళలు ఆరోపించారు. బతుకమ్మ ఆడుతున్న తమను కొందరు కులం పేరుతో దూషిస్తూ, వేడుకల్లో పాల్గొనకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ ఆడుతున్న సమయంలో తమను అవమానకరమైన మాటలతో దూషించి, పక్కకు వెళ్లాలని చెప్పారని బాధిత మహిళలు ఆరోపించారు. అంతేకాకుండా సర్పంచ్‌పై ఒత్తిడి తెచ్చి డీజే బాక్స్‌ను తొలగింపజేశారని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాధిత మహిళలు ఆదివారం ఆత్మకూర్ ఎం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసి, పండుగ సమయంలో కులం పేరుతో అవమానించి బతుకమ్మ ఆడకుండా అడ్డుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగలు అందరూ కలిసి ఆనందంగా జరుపుకోవాల్సిన సందర్భాల్లో కుల వివక్షకు తావివ్వకూడదని బాధిత మహిళలు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# రెడ్‌క్రాస్ జిల్లా డైరెక్టర్‌కు ఘన సన్మానం

**ఆత్మకూర్ (ఎం) అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**

ఇటీవల జరిగిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన మన నేతాజీ యువజన మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతికంఠం పూర్ణచందర్ రాజును నేతాజీ మండలి సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు దొంతరబోయిన మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి యాస మహేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ప్రతికంఠం శంతన్‌రాజ్, సభ్యులు గట్టు విశాల్, యాస సుభాష్‌రెడ్డి, కోల అఖిల్, గుండెగాని వినయ్, మాద నరేష్, కందడి మధు, కట్టెకోల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మలోనూ కుల వివక్ష

## - దళిత సర్పంచికి అవమానం

## - బతుకమ్మలోనూ కుల వివక్ష!

## - దళిత సర్పంచి బతుకమ్మను కలపడంతో ఆటలు బంద్

## - అమ్మనబోలులో ఘటన. స్థానికుల ఆగ్రహం



**ఆలేరు, అక్టోబర్ 11(ప్రజా జ్యోతి):**

ఆడపడుచుల ఆటపాటలతో సందడిగా జరగాల్సిన బతుకమ్మ పండుగలో కుల వివక్ష చోటుచేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలులో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన గ్రామ సర్పంచి మామిడాల నర్సమ్మకు బతుకమ్మ వేడుకల్లో అవమానం ఎదురైంది. గ్రామపంచాయతీ ఎదుట బీసీ మహిళలు బతుకమ్మ ఆడుతుండగా సర్పంచి, వార్డు సభ్యురాలు బొజ్జ శ్రీలత తదితరులు అక్కడికి వెళ్లి తమ బతుకమ్మలను వారితో కలిసి ఉంచి ఆడేందుకు ప్రయత్నించారు. అయితే మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళలు బీసీల బతుకమ్మలతో కలిసి ఎలా ఆడుతారంటూ కొందరు మహిళలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన సర్పంచి, వార్డు సభ్యురాలు తమ బతుకమ్మలను తీసుకుని గ్రామంలోని పోచమ్మ గుడి వద్దకు వెళ్లారు. అక్కడ ఇతర మహిళలు బతుకమ్మ ఆడుతుండగా సర్పంచి, వార్డు సభ్యురాలు తీసుకొచ్చిన బతుకమ్మలను వాటితో కలిపి ఉంచారు. దీంతో అప్పటివరకు బతుకమ్మ ఆడుతున్న బీసీ మహిళలు ఒక్కసారిగా ఆటను నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం బతుకమ్మలను అక్కడి నుంచి తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. దీంతో ప్రతి ఏటా రాత్రి 11.30 గంటల వరకు సందడిగా సాగే బతుకమ్మ వేడుకలు ఈసారి రాత్రి 7.30 గంటలకే అర్ధాంతరంగా ముగిశాయి.

### సర్పంచికే కుల వివక్ష సెగ!

గ్రామానికి ప్రథమ పౌరురాలిగా ఉన్న సర్పంచికే కులం పేరుతో అవమానం ఎదురుకావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పూలను పేర్చి, ప్రకృతిని పూజిస్తూ మహిళలంతా ఐక్యంగా జరుపుకోవాల్సిన బతుకమ్మ పండుగలో కులాల పేరుతో వేర్పాటు చూపడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధి అనే గౌరవం కూడా లేకుండా సామాజిక వర్గం పేరుతో అవమానించడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగల్లోనూ అంటరానితనం పాటిస్తే సమాజంలో మార్పు ఎప్పుడు వస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై సర్పంచి మామిడాల నర్సమ్మ మాట్లాడుతూ, ఎన్నడూ లేని విధంగా ఈసారి మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళలు బీసీ మహిళల బతుకమ్మలతో కలిసి ఎలా పెడతారంటూ ఓ బీసీ మహిళ వ్యాఖ్యానించిందని తెలిపారు. వార్డు సభ్యురాలు బొజ్జ శ్రీలత మాట్లాడుతూ, తాము తీసుకొచ్చిన బతుకమ్మను అక్కడి బతుకమ్మలతో కలిపి ఉంచగానే మహిళలు ఆటను నిలిపివేసి వెళ్లిపోయారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అదే మండలంలోని మాటూరులోనూ ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు వేర్వేరుగా బతుకమ్మ ఆడినట్లు తెలిసింది. పండుగలు కులమతాలకు అతీతంగా ప్రజలను ఒక్కటి చేయాల్సి ఉండగా, ఇలాంటి ఘటనలు సామాజిక అంతరాలను మరోసారిబయటపెడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుల వివక్షకు తావులేకుండా అందరూ సమానంగా పండుగలు జరుపుకునే పరిస్థితులు రావాలని వారు కోరుతున్నారు.

# మోట కొండూరులో పచ్చదనం పరిశుభ్రత

**ఆలేరు అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజాసేవలో మైలురాలను పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో పచ్చదనం పరిరక్షణకు చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పడమటి మాణిక్యం రెడ్డి, కాశినాదు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిర్ర రవీందర్,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మల్గా అశోక్, శనిగరం ప్రదీప్ జీవికలపెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రులు

## - బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**హాలియా,అక్టోబర్11(ప్రజా జ్యోతి)**



పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మికోత్సాహం నడుమ అత్యంత వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున జగన్మాత శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి దివ్య అలంకారంలో భక్తులకు అభయా హస్తం అందిస్తూ దర్శనమిచ్చారు.ఈ పవిత్ర పర్వ దినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చక స్వాములు అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు,సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు,కుంకుమార్చనలు నామార్చనలను నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం విశ్వశాంతిని,లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి మూలమంత్ర హోమాన్ని ఘనంగా జరిపారు.ఆలయ ఆవరణమంతా ధూపదీప నైవేద్యాలు,వేదఘోషలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.కార్యక్రమానికి విచ్చేసిన భక్తజనసందోహానికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. తొలిరోజే అమ్మవారి దివ్యరూపాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తరించారు.

# ఆలేరులో ఎస్బి స్టోర్ ప్రారంభం

**ఆలేరు అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ఏర్పాటుచేసిన ఎస్ బి స్టోర్ను శనివారం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి నూతనంగా ఏర్పాటు చేసిన స్టోర్ ప్రజలకు అందు బాటులోకి రావడం పట్ల నిర్వా హకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు నిర్వా హకులు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యం...!

## - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

## - యాద్గర్ పల్లి లో కోటి వ్యయంతో త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులకు శంకుస్థాపన



**మిర్యాలగూడ, అక్టోబర్ 11,(ప్రజాజ్యోతి):**

రైతులకు నిరంతరంగా 24 గంటలు విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్)అన్నారు.ఆదివారంమిర్యాలగూడ మండలం యాద్గార్ పల్లి గ్రామంలో సుమారు రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న త్రీఫేస్ విద్యుత్ లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ మాట్లాడుతూ రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో గ్రామంలో త్రీఫేస్ విద్యుత్ లైన్‌కు సంబంధించిన స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచనున్నట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.రైతులకు సాగునీటి సౌకర్యంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జోన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, మెహబూబ్ అలీ , తలకొప్పుల సైదులు, గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఉమెన్స్ అండ్ మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్ - 2026

## కరపత్రాలు విడుదల చేసిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

**మిర్యాలగూడ, అక్టోబర్ 11,(ప్రజాజ్యోతి):**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ -2026( ఓపెన్ టు ఆల్ ) నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టోర్నమెంట్ కు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ ) విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ క్రీడా ప్రతిభను చాటాలని కోరారు. ఈ టోర్నమెంటులో గెలుపొందిన జట్టుకు మెన్స్ మొదటి బహుమతి 30 వేల రూపాయలు, షీల్డ్.రెండో బహుమతి 25 వేల రూపాయలు,షీల్డ్. మూడో బహుమతి 20వేల రూపాయలు, షీల్డ్,నాలుగో బహుమతి 15వేల రూపాయలు,షీల్డ్ . అదేవిదంగా ఉమెన్స్ మొదటి బహుమతి 20 వేల రూపాయలు,షీల్డ్. రెండో బహుమతి 15వేల రూపాయలు, షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు ఆడోత్ అశోక్, దైద సోమ సుందర్,బూడిద సైదులు, మాజీ కౌన్సిలర్లు కొమ్ము శ్రీనివాస్, మంత్రాల రుణాల్ రెడ్డి,వాలీబాల్ ప్లేయర్స్, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



# నవ్య కళానికేతన్ ఆధ్వర్యంలో ఘనంగా 'స్వరరాగ సుధా' సంగీత విభావరి

## - మధుర గీతాలతో అలరించిన గాయనీ గాయకులు

## - కళాకారులకు ఘన సన్మానం





**మిర్యాలగూడ, అక్టోబర్ 11,(ప్రజాజ్యోతి):**

నవ్య కళానికేతన్ మిర్యాలగూడ వారి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస కల్చరల్ ఏసీ మినీ స్టూడియోలో నిర్వహించిన 'స్వరరాగ సుధా' సంగీత కార్యక్రమం ప్రేక్షకులను మధుర గీతాలతో ఓలలాడించింది. గాయనీ గాయకులు తమ మధురమైన స్వరాలతో ఆనాటి పాత మధుర గీతాలను రసరమ్యంగా ఆలపించి సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. నాటి ప్రముఖ గాయనీ, గాయకులను స్ఫూర్తిగా తీసుకొని తమ గాన ప్రతిభను చాటుతూ ఆహూతులను అలరించారు.ఈ సందర్భంగా కళాపోషణకు, కళాకారుల ప్రోత్సాహానికి విశేషంగా సహకరిస్తున్న న్యాయవాదులు పేదబోయిన శ్రీనివాస్ యాదవ్, మట్టపల్లి రామచంద్రయ్య, అలుగుబెల్లి భూపతిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. అలాగే మిర్యాలగూడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ న్యాయవాదుల చేతుల మీదుగా గాయనీ గాయకులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా పేదబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, నవ్య కళానికేతన్ ఆధ్వర్యంలో ఇలాంటి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. కళామాతల్లి సేవలో నవ్య కళానికేతన్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.న్యాయవాది మట్టపల్లి రామచంద్రయ్య మాట్లాడుతూ, నవ్య కళానికేతన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కళాకారులను ప్రోత్సహిస్తూ సంగీత రంగానికి సేవలందిస్తున్న సంస్థకు, దాని నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.నేతి సత్యనారాయణ మాట్లాడుతూ, నవ్య కళానికేతన్ అధ్యక్షులు తడకమల్ల రామా రంగారావు తమకు గురుతుల్యులని పేర్కొన్నారు. కళాకారులను ప్రోత్సహిస్తూ సంగీత, సాంస్కృతిక రంగానికి వారు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని ప్రశంసించారు. నవ్య కళానికేతన్ ఆధ్వర్యం లో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. తడకమల్ల రామా రంగారావుమాట్లాడుతూ, కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు కర్నాటి రమేష్, కర్నాటి లక్ష్మీనారాయణ, గౌరు శ్రీనివాస్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.మిర్యాలగూడలోని ప్రతిభావంతులైన గాయనీ గాయకులను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తూ కళామాతల్లి ముద్దుబిడ్డలుగా తీర్చిదిద్దడమే నవ్య కళానికేతన్ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు ప్రజలందరూ తమకు తోచిన విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో నవ్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమల్ల రామా రంగారావు, కందుకూరి సుదర్శన్, దాసరాజు రమణ కుమార్, హెచ్చు రవి, కంబాల శ్రీనివాస్, గాయనీమణులు శ్రీరాణి, రజిని, హైదరాబాద్‌కు చెందిన హరిచందన, ముకుందాపురానికి చెందిన మౌనిక, కళాసేవకులు, కళాపోషకులు, కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ధూపాటి మట్టయ్య, మిర్యాలగూడ బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రాయారపు భాస్కర్ నాయుడు, డి. రాజశేఖర్ నాయక్, బంటు మోహన్, శీలం వీరేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ ఉత్సవాలు.. భక్తిపారవశ్యం

**గరిడేపల్లి,అక్టోబర్ 11(ప్రజా జ్యోతి):**

గరిడేపల్లి రామాలయం దుర్గ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కనకదుర్గమ్మ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి.అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి అమ్మవారిని ప్రత్యేకంగా అలంక రించి పూజలు అర్చనలు నిర్వహించారు.అమ్మ వారి నామస్మరణ తో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాల్లో మహిళలు, యువత, గ్రామ స్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు ఐక్యత కు ప్రతీకగా ఆధ్యాత్మిక వేడుకలు దుర్గ యూత్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఉత్సవాలు భక్తిభావాన్ని చాటిచెప్పడం తో పాటు యువత ఐక్యతను ప్రతిబిం బించాయి.ఉత్సవాల విజయవంతానికి సహకరించిన భక్తులకు, గ్రామస్థులకు దుర్గ యూత్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ చంద్రయ్య,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ అమరవీరుల స్థూపం పరిశీలన

**ఆలేరు అక్టోబర్ 11(ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో నిర్మాణం అవుతున్న తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శనివారం పరిశీలించారు. ఈ కార్య క్రమంలో శ్రీనివాస్, మహేందర్, అశోక్ ,శ్రీనివాస్, గణేషు, దశరథ ,శ్రీనివాస్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు సన్మానం

## మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

**ఆలేరు అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ ఉద్యమానికి నాడు సంపూర్ణంగా మద్దతు పలికి ఉద్యమానికి ఎంప్లాయ్ యూనియన్ బలోపేతం చేసిన ఉద్యమకారులకు మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్ర నుంచి రిటైర్డ్ ఉద్యోగి కొంతమంది రెడ్డినీ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి, తుంగ బాలు, మాజీ ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి, మోట కొండూరు మండల అధ్యక్షులు బొట్ల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.





# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆలేరు అక్టోబర్ 11(ప్రజా జ్యోతి)



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996 -1997 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శనివారం ఏబీఎన్ రెడ్డి మినీ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఆనాడు పాఠశాలలో జరిగిన సంఘటనలు గుర్తుచేసుకొని ఒకరికొకరు మాట్లాడుకున్నారు. అప్పట్లో పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను కొట్టిన సంఘటనలు గుర్తు చేసుకున్నారు. పాడిన పాటలను ఆడిన ఆడాలను ఒకరికొకరు చెప్పుకుంటూ తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో జరిగిన నవ్వే సంఘటనలు ఉపాధ్యాయులతో పంచుకున్న తీపి జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఉపాధ్యాయులతో కలిసి సంక్షిప్త భోజనం చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు షీల్డ్ బహుకరించి శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరె బాలరాజు, అంకం శ్రీనివాసు, ఎదునూరి భాస్కర్, బాసెట్టి వేణు, బెల్దే ప్రవీణ్ , శీలం శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మణ్ ,నర్సింగారావు, ప్రవీణ్ ,క్రాంతి, మేకల బీరయ్య ,తాళ్ల మల్లయ్య, ఎర్ర లక్ష్మీనారాయణ నల్ల సబిత,దూడల వసంత,విజేత రెడ్డి, మంజుల ,సావిత్రి,అర్చన,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కాళీ మాత దేవాలయంలో ఘనంగా భవాని మాత మాలధారణ

నార్కట్ పల్లి, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):





నార్కట్ పల్లి లో స్ఫూర్తి కాలేజీ దగ్గరగురిజ అశోక్ స్వామి నిర్మాణం చేసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కాళీ మాత దేవాలయంలో ఆదివారం నాడు ఆలయ వ్యవస్థాపకులు గురజ అశోక్ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ డావ ఉత్తరపల్లి నరసింహచార్యుల ఆధ్వర్యంలో భవాని మాత మాలాధర కార్యక్రమం ఘనంగా నిర్వహించారుఈ కార్య క్రమంలో దుర్గా దేవి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేసి నూతన పట్టు వస్త్రాలు తో అలంకరించి పూజలు నిర్వహించారు అనంతరం సుమారు500 స్వాములకు మాలధరణ అర్చకులుగురుస్వామి ఉత్తర పల్లి నరసింహచార్యులు నిర్వ హించారు. ఈ కార్య క్రమంలో గురుస్వామి నడింపల్లి శ్రవణ్, గురిజ రామచంద్రుడు,క్రాంతి, సహాయ అర్చకులుఅందోజు అమరేందర్, చోల్లేటి పవన్, కుమార్,మూసోజనవీన్ శర్మ, సైదులు ఉపేందర్ చారి, చార్మి, మహేష్ చుట్టు పక్కల మండలల నుండి గ్రామాల నుంచి స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవి నవరాత్రి ఉత్సవాలలో ఎమ్మెల్యే దంపతులు

## - బాల త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు

చిట్యాల అక్టోబర్ 12 ప్రజాజ్యోతి



చిట్యాల పట్టణంలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజ కలశస్థాపనతో ఉత్సవాలకు నాంది పలికారు. మొదటిరోజు పసుపు ఎరుపు వస్త్రంతో అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. చక్కెర పొంగలిని నైవేద్యంగా సమర్పించారు. ఈనెల 20వ తేదీ వరకు రోజుకొక్క అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ అన్ని ఏర్పాట్లు చేశారు.దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పుష్ప దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ వారికి ముందుగా ఘన స్వాగతం పలికి, సత్కరించారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పందిరి గీత రమేష్, వైస్ చైర్పర్సన్ గుండెబోయిన శ్రీ లక్ష్మీ సైదులు, కౌన్సిలర్లు నాగిల్ల సుధాకర్, గాలి యాదమ్మ లింగయ్య, బొబ్బల సందీప రామ్ రెడ్డి, ఏర్పుల పరమేష్, దేశపాక లత రాజేష్, కుక్కల మోహన్, కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, బెల్లి సత్తయ్య నాయకులు పోకల దేవదాసు, జడల చిన్న మల్లయ్య, ఎద్దులపురి కృష్ణ, పాటి నర్సిరెడ్డి, గుడిపాటి లక్ష్మీనరసయ్య, వనమా వెంకటేశ్వర్లు, పాటి మాధవరెడ్డి, పట్టణ వర్కింగ్ ప్రసెడెంట్ జయారపు శివ,ఎస్కే ఇబ్రహీం పుల్లెంల కోటయ్య, పంతంగి వెంకన్న, సిల్వేరు మౌనిక శేఖర్, కొసనం అశోక్, వేముడాల యాదయ్య, గాలి యాదగిరి, చొల్లేటి శ్రీకాంత్, అర్చకులు వాసుదేవ శర్మ, గోవింద్ శర్మ, పవన్ కుమార్ ఆచార్యులు, దుర్గేష్ శర్మ, శుభం శర్మ, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దేవస్థానం కమిటీ డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంత నరసింహారెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్టా సాయిలు, బెలిదె సత్యనారాయణ, ఏళ్ల మాధవి బయ్యన్న, కుమ్మరి దేవి రవి, ఆలయ అధికారి ఏనుగు నరసింహారెడ్డి, సేవకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో బండారు కవితా రెడ్డి పేరు!

## బీజేపీ టికెట్ రేసులో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు

## నల్గొండఖమ్మంవరంగల్ స్థానంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ

నడిగూడెం, అక్టోబర్ 11,ప్రజా జ్యోతి:

నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థిత్వంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పార్టీ తరఫున పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు ప్రయత్నాలు సాగిస్తున్న క్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బండారు కవితా రెడ్డి పేరు తెరపైకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ అభ్యర్థిత్వం కోసం పరిశీలనలో ఉన్న పేర్లలో ఆమె పేరు కూడా వినిపిస్తుండటంతో రాజకీయంగా ఆసక్తి నెలకొంది. కోదాడ నియోజకవర్గం, నడిగూడెం మండలం బృందావనపురం గ్రామానికి చెందిన బండారు కవితా రెడ్డి ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థి ఎంపికపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆమె పేరు ప్రస్తావనకు రావడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలో నిరుద్యోగ యువత ఆకాంక్షలు, ఉద్యోగుల సమస్యలు, విద్యారంగ అభివృద్ధి, పట్టభద్రుల హక్కులు వంటి అంశాలు ఎన్నికల్లో కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలో పట్టభద్రుల సమస్యలపై గళం వినిపించే అభ్యర్థిని బరిలోకి దింపేందుకు పార్టీలు వ్యూహాలు రూపొందించే అవకాశం ఉంది. బీజేపీ టికెట్ కోసం పలువురి పేర్లు చర్చకు వస్తున్న తరుణంలో బండారు కవితా రెడ్డికి అవకాశం లభిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, ఆమె అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. పార్టీ నాయకత్వం తీసుకునే తుది నిర్ణయంపై రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

**చింతలపాలెం, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి) :**

చింతలపాలెం మండలం పాత రేబల్లె గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామికి విశేష ఆరాధన పూజలు, శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన ఆర్ అండ్ ఆర్ సెంటర్ రేబల్లెలోని బాలాలయాల వద్ద గోపూజ నిర్వహించారు. మండపంలో అమ్మవార్లను ప్రతిష్ఠించి గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, అఖండ స్థాపన, మండపారాధన, అష్టోత్తర శతనామ పూజ, సహస్రనామ పూజలతో పాటు మహిళలచే కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు డి.వి. ప్రసన్నకుమార్, ఇనుపకుతికెల శ్రీరామ చంద్రమౌళీశ్వర శర్మ, గ్రామ పురోహితులు ఇనుపకుతికెల ఆంజనేయ శర్మ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాల కార్యనిర్వహణాధికారి కూన్‌రెడ్డి కొండారెడ్డి, ఆలయ చైర్మన్లు చల్లా రవీందర్‌రెడ్డి, ముమ్మనేని భరత్‌కుమార్, గ్రామ సర్పంచ్ ఐలపంగు మాధవి వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గడ్డం రాజశేఖర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# 31వ వార్డులో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## - ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ సుమయ్య తబస్సుం

**భువనగిరి,అక్టోబర్ 11ప్రజాజ్యోతి**

భువనగిరి,పట్టణంలోని 31వ వార్డు బంజారాహిల్స్‌లో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి,ప్రకృతి ఆరాధనకు, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో,ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళలు మన సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ఈ వేడుకల్లో బానోత్ జ్యోతి, ధనమ్మ, బానోత్ సరోజ, మంత్రి ఉమ, రాచ స్వప్న, ముక్కెర్ల అనితతో పాటు 31వ వార్డుకు చెందిన పలువురు మహిళలు పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో వేడుకలను సందడిగా నిర్వహించారు.మహిళలందరూ కలిసికట్టుగా పాల్గొనడంతో వార్డులో



పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని మహిళలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో వార్డు నాయకులు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన దైద రవీందర్

**నల్లగొండ అక్టోబర్ 11 ( ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్ నియోజకవర్గం:నార్కట్‌పల్లి మండలంలోని పల్లివివేరా హోటల్‌లో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డిని కలిసి పలు విషయాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గార్లపాటి రవీందర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# నడిగూడెంలో జాతీయ స్థాయి క్రికెట్ సందడి!

## - గ్రామీణ క్రీడా ప్రతిభకు పెద్దపీట..

## గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తే ముఖ్యం:

## - టీపీసీసీ డెలిగేట్ లక్ష్మీనారాయణ రెడ్డి



**నడిగూడెం, అక్టోబర్ 11, ప్రజా జ్యోతి:**

క్రీడలు స్నేహబంధాలను పెంపొందించడంతో పాటు ఐకమత్యాన్ని బలోపేతం చేస్తాయని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని టీపీసీసీ డెలిగేట్ లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ స్థాయి క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయమని పేర్కొన్నారు. నడిగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏఎన్‌ఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉత్తమ్ పద్మావతి ప్రీమియర్ క్రికెట్ జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ లీగ్ పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రీడాకారుల మధ్య స్నేహభావాన్ని, ఐకమత్యాన్ని పెంచుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి జాతీయ స్థాయి పోటీల నిర్వహణ వల్ల స్థానిక క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని, ఉన్నత స్థాయిలో రాణించేందుకు మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు.క్రీడా పోటీల నిర్వహణలో నిర్వాహకులు ఎలాంటి పక్షపాతానికి తావివ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. క్రీడాకారులు క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొంటూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ప్రత్యర్థుల పట్ల గౌరవం చూపుతూ నిజమైన క్రీడాస్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిక్షపతి, నడిగూడెం సర్పంచ్ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కవిత నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లపు శ్రీనివాస్, ఏఎన్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ నాగేందర్ రెడ్డి, బీసీ సంఘం డివిజన్ అధ్యక్షుడు కాసాని శివ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు మీరాజుద్దీన్, పీడీ ప్రకాష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మూర్తి, పోటీల నిర్వాహకులు సతీష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణకారుల శంఖారావం విజయవంతం చేయాలి

- జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి

**హాలియా,అక్టోబర్11(ప్రజా జ్యోతి)**

స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గ్రౌండ్‌లో తలపెట్టిన రాష్ట్రస్థాయి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నల్లగొండ జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రాచకొండ గిరి పిలుపునిచ్చారు. ఆదివారం హాలియాలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వర్ణ కారులు తమ షాపులను స్వచ్ఛందంగా బంద్ చేసి సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని,జీవో నెంబర్ 272ను సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని బ్యాంకులలో పనిచేస్తున్న అప్రైజర్లకు సీలింగ్ విధానాన్ని పూర్తిగా తొలగించి, సమాంతర కమిషన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అక్రమంగా తరలివస్తున్న బంగారం రికవరీలను అరికట్టడంతో పాటు,50 సంవత్సరాలు నిండిన ప్రతి స్వర్ణకార వృత్తిదారునికి నెలకు రూ.5,000 పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ స్వర్ణకార సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గుర్రపు తండా సమీపంలో ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు: నేరడుగొమ్ము పోలీసులు

**దేవరకొండ, అక్టోబర్11, (ప్రజా జ్యోతి) :**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నేరడుగొమ్ము మండలం గుర్రపు తండా సమీపంలో పోలీసులు ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. శనివారం/ఆదివారం రహదారిపై వెళ్లే వాహనాలను నిలిపివేసి, డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగేంద్ర బాబు మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల వాహనదారుల ప్రాణాలకే కాకుండా, రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా తీవ్ర ముప్పు వాటిల్లుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి డ్రైవింగ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రమాద రహిత సమాజం కోసం వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.



# కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా గుడపూరి భాస్కర్ కురుమ

**నల్లగొండ అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

శాలిగౌరారం, : కురుమ యువ చైతన్య సమితి తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన గుడపూరి భాస్కర్ కురుమ నియమితులయ్యారు. కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ మోటె రవి కురుమతో పాటు రాష్ట్ర కమిటీ సంయుక్తంగా ఈ నియామకాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన గుడపూరి భాస్కర్ కురుమ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌తో పాటు రాష్ట్ర కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కురుమ యువతలో చైతన్యం పెంపొందించేందుకు, సమితి ఆశ యాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని భాస్కర్ కురుమ తెలిపారు.



# నడిగూడెం ఆర్‌ఎంపీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా తాళ్లపల్లి భాస్కర్..

- ప్రధాన కార్యదర్శిగా కొత్త ఉపేందర్

**నడిగూడెం, అక్టోబర్ 11,ప్రజా జ్యోతి:**

నడిగూడెం మండలంలో రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ (ఆర్‌ఎంపీ) సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం అభివృద్ధి, సభ్యుల ఐక్యత, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. నూతన మండల అధ్యక్షుడిగా తాళ్లపల్లి భాస్కర్, ఉపాధ్యక్షుడిగా కే. నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా కొత్త ఉపేందర్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.కే. బడే మియా, సహాయ కార్యదర్శులుగా జానపాటి వీరబాబు, నాగేశ్వరరావు, కోశాధికారిగా నవీన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.కే. నసీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బెల్లంకొండ రాంబాబును ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సతీష్, రఫీని ఎంపిక చేశారు. ఈ సమావేశానికి సూర్యాపేట జిల్లా రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దొంతగాని రవిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు భూతం శ్రీనివాసరావు, జిల్లా నాయకుడు కేవీఎన్ గౌడ్, మునగాల మండల అధ్యక్షుడు శ్రీశైలం, కోదాడ మండల అధ్యక్షుడు పి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం బలోపేతానికి, సభ్యుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ సమన్వయంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.



# కొండమల్లేపల్లిలో నేడు జల్సాయే సీరతున్నబీ

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):**

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జనప్రియ గార్డెన్‌లో జమీ యతుల్ ఉలేమా ఆధ్వర్యంలో నేడు జల్సాయే సీరతున్నబీ నిర్వ హించనున్నట్లు మండల అధ్యక్షుడు మొహమ్మద్ నజీరుద్దీన్ మౌలానా ఖాస్మి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి జోహర్ నమాజ్ వరకు జరిగే ఈ సభలో ఇస్లామిక్ పండితులు మహమ్మద్ ప్రవక్త పవిత్ర జీవిత చరిత్ర, బోధనలు, శాంతి, సోదరభావం, కరుణ సందేశాలను వివరించనున్నారు. ప్రముఖ మతపెద్దలు పాల్గొనే ఈ కార్యక్రమానికి ముస్లిం సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. మహిళల కోసం ప్రత్యేక పరదా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.



# యోగాతో ఆరోగ్యం మేలు



**చిట్యాల అక్టోబర్ 12 ప్రజా జ్యోతి**

ప్రతి ఒక్కరూ యోగ చేసి ఆరోగ్యంగా ఉండాలనిది ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ పల్లపు బుద్ధుడు అన్నారు. చిట్యాల మండలం చిన్న కాపర్తి గ్రామంలో రైతు వేదికలో యోగ మెడిటేషన్ కార్యక్రమాలు చిన్నకాపర్తి గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ మండల అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య లు కరపత్రికలు విడుదల చేశారు .ఈ సందర్భంగా బుద్ధుడు మాట్లాడుతూ గ్రామ ప్రజలతో, యువకులతో, విద్యార్థులతో యోగా ఆసనాలు వేయించి మెడిటేషన్ కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్సు ఒత్తిడిని పారదోలి, ఆచరణాత్మక చర్యలకు వీలు కల్పిస్తూ, మన ఆరోగ్యాన్ని మరియు జీవశక్తిని పెంపొందిస్తుంది. దీనివల్ల మీరు యోగా యొక్క ప్రాచీన ఆచరణాలు ధ్యానం మరియు ఉచ్ఛ్వాస నిశ్వాసాలను చక్కగా పొందుతారు అని తెలిపారు.జీవితం ఆనందదాయకంగా ఉండాలంటే సుదర్శన క్రియ అవసరం,రక్తపోటు మధుమోహం, ఉబ్బసం వంటి మొదలగు వాటిని అరికట్టవచ్చు, ఎన్నో ఒత్తిడి వల్ల వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, పిఏసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, అద్దెల లింగారెడ్డి, బెల్లంకొండ రఘు ఆవుల రమేష్ మెట్టు నాగ శంకర్, వలిగొండ సత్యనారాయణ, నరసింహ ప్రశాంత్, అశోక్ వెంకన్న దివాకర్ లింగయ్య శంకరయ్య రమేష్ నరసింహ వెంకటేష్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాచిరెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

- 124 మందికి వైద్య పరీక్షలు ఉచితంగా మందుల పంపిణీ

**నాగారం అక్టోబర్ 11 ప్రజా జ్యోతి:**

మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సింధు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ వడ్డే వెంకన్న రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 124 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 30 మందికి ఈసీజీ, 18 మందికి 2డీ ఎకో, ఇద్దరికి తాప్సిమీర్, ఒకరికి మామో గ్రామ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాతి నాగమ్మ, వార్డు సభ్యులు వడ్డే మల్లమ్మ, వడ్డే కిరణ్, ఆకుల మల్లేష్, నాతి రాజేశ్వరి, నాతి శ్రీనివాస్, పిన్నమరెడ్డి ఆకుపరెడ్డి, ఈదుల అన్నపూర్ణతో పాటు గ్రామస్తులు మట్టగజం అంజయ్య, వడ్డే యాదగిరి, ఈదుల రవిశంకర్, మట్టగజం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# పెద్దకాపర్తి లో ఘనంగా దేవీ నవరాత్రులు ఉత్సవాలు

**చిట్యాల అక్టోబర్ 12 ప్రజా జ్యోతి**



చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పూజా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ దంపతులు కాటశీ వెంకటేశం పద్మ అమ్మవారికి బంగారు ముక్కుపుడక కానుకను సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఏదుల్ల ప్రభాకర్ రెడ్డి, మా రెడ్డి తిరుమలరెడ్డి, పొట్లపల్లి సుభాష్, కమిటీ చైర్మన్ సభ్యులు మాట్లాడుతూ 18వ తేదీ రోజున చండీయాగం కార్యక్రమం ఉంటుందని దీనిలో అందరూ పాల్గొనాలని గ్రామంలో వర్షాలతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని దీని ఉద్దేశం ఈ సంకల్పాన్ని గ్రామ ప్రజలందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు వారి వెంట నారాయణ రమేష్ తాటి చంద్రమౌళి ఏర్పుల నరసింహ మర్రి హరీష్ రెడ్డి కురు యాదయ్య ఆనగంటి లింగస్వామి ఏర్పుల వెంకన్న, భక్తులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కాంగ్రెస్ కమిటీని సన్మానించిన ఎమ్మెల్యే

**చిట్యాల అక్టోబర్ 12 ప్రజా జ్యోతి**



చిట్యాల మున్సిపాలిటీ కాంగ్రెస్ టౌన్ కమిటీ ని నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం సన్మానించి శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ సందర్భంగా టౌన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జయారపు శివ, వైస్ ప్రెసిడెంట్ చొల్లేటి శ్రీకాంత్ లను సన్మానించి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చాలని సూచించారు. చిట్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలపై నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గారు త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చిట్యాల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు ఎద్దులపురి కృష్ణ, మున్సిపాలిటీ చైర్మన్ పందిరి గీత రమేష్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబురాలు

- మునుగోడు నియోజకవర్గ నలుదిక్కుల నుండి వచ్చి ఆడి పాడిన ఆడపడుచులు
- మునుగోడు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మీ
- మునుగోడులో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న బతుకమ్మ వేడుకలకు కుటుంబ సమేతంగా హాజరైన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**చండూరు అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):-**



తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకడ ప్రకృతిని ఆరాధించే అపురూపమైన పండుగడ పూలను పూజించే మన సంస్కృతికి నిలువుటద్దంఁ మన తెలంగాణ పండుగ బతుకమ్మ.... గుమ్మడి పూలు, తంగేడు పూలు, గునుగు పూలు, బంతి పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల మధ్య, మహిళల ఆటపాటలతో, జానపద గీతాల నడుమ మునుగోడు గడ్డపై బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి..మునుగోడు లోని క్యాంపు కార్యాలయం నుండి నియోజకవర్గ మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల ప్రాంగణానికి బతుకమ్మలతో చేరుకుని వేదమంత్రాలతో పూజలు చేసి 15 అడుగుల బతుకమ్మకు హారతిచ్చి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తో కలిసి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మీ...బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదని, ఇది మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని,మహిళల ఐక్యతకు, కుటుంబాల సంతోషానికి, తెలంగాణ అస్తిత్వానికి ప్రతిరూపమైన ఈవేడుకలను అంగరంవైభవంగా నిర్వహించారు...ఈ బతుకమ్మ వేడుకలకు నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది మహిళలు తమ కుటుంబాలతో కలిసి తరలివచ్చారు...నాటి పల్లె పాటల నుండి నేటి డీజే పాటల వరకు ప్రతి బతుకమ్మ పాటకు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు...ఈ బతుకమ్మ పండుగ మన మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రతి ఆడపడుచు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని,. రైతులు సుభిక్షంగా ఉండాలని,. మన గ్రామాలు అభివృద్ధి చెందాలని,. మన తెలంగాణ సంస్కృతి తరతరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు కోమటిరెడ్డి లక్ష్మీ...బతుకమ్మ ఆడే ప్రతి మహిళ వద్దకు వెళ్లి పలకరించారు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ...తమ దగ్గరికి వచ్చిన తమ అబిమాన నాయకున్ని ప్రతి మహిళ ఆత్మీయంగా పలకరించారు..బతుకమ్మ ఆడి అలసిన మహిళలకు కడుపునిండా భోజనం చేసి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయడంతో ప్రతి ఒక్కరు భోజనాలు చేసి తమ గ్రుహాలకు తరలి వెళ్లారు..ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా మహిళ లతో పాటు నియోజకవర్గ ముఖ్య నాయకులు హాజరయ్యారు....